క్లుప్తంగా

జగనన్న కాలనీల్లో గృహాలు నిర్మించుకోండి

నగర పంచాయతీ ఇన్‌చార్జి కమిషనర్ బాలకృష్ణ



తిరువూరు: జగనన్న కాలనీలలో పక్కాగృహాలు మంజూరైన లబ్ధిదారులు త్వరితగతిన నిర్మాణం చేపట్టాలని తిరువూరు నగర పంచాయతీ ఇన్‌చార్జి కమిషనర్ బాలకృష్ణ కోరారు. శనివారం హౌసింగ్ డే సందర్భంగా పాత తిరువూరులోని కాలనీ లేఅవుట్లను పరిశీలించారు. నిర్మాణం చేపట్టిన లబ్ధిదారులు వెంటనే పనులు పూర్తి చేయాలని, ఇంకా పనులు ప్రారంభించని వారు గ్రౌండింగ్ చేపట్టాలని కోరారు. హౌసింగ్ డీఈ రహీముద్దీన్, సిబ్బంది పాల్గొన్నారు.

చిరుధాన్యాల సాగుపై అవగాహన

జూపూడి(ఇబ్రహీంపట్నం): జూపూడి రైతు భరోసా కేంద్రంలో చిరుధాన్యాల సాగుపై రైతులకు అవగాహన సదస్సు శనివారం నిర్వహించారు. జిల్లా వ్యవసాయ శిక్షణాకేంద్రం అధికారి మాధవీలత మాట్లాడుతూ 2023 ఏడాది అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించారన్నారు. ప్రస్తుతం జూపూడిలో చిరుధాన్యాలైన జొన్న పంట ఎక్కువగా పండిస్తున్నారన్నారు. మైలవరం ఏడీ శ్రీనివాసరావు మాట్లాడుతూ రైతులు క్లస్టర్‌గా ఏర్పడి చిరుధాన్యాలు సాగుచేస్తే హెక్టార్‌కు రూ.6 వేలు ప్రభుత్వ ప్రోత్సాహం ఉంటుందన్నారు. వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

మందుల పిచికారీలో జాగ్రత్తలు తప్పనిసరి

జి.కొండూరు: పంటలపై రసాయనిక మందులను పిచికారీ చేసే సమయంలో రైతులు, కూలీలు తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలని మండల వ్యవసాయాధికారి రాంకుమార్ అన్నారు. మండల పరిధి చెర్వుమాధవరం గ్రామ సచివాలయ పరిధిలోని రైతుల వ్యవసాయ క్షేత్రాల్లో వైఎస్సార్ పొలంబడి కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. మిత్ర పురుగులు ఉనికిని చాటాలంటే రైతులు రసాయని మందుల వినియోగం తగ్గించి సేంద్రీయ వ్యవసాయం వైపు మొగ్గుచూపాలని కోరారు. కార్యక్రమంలో రైతులు, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పేద యువతి వివాహానికి సాయం

పెనుగొలను(గంపలగూడెం): పేద కుటుంబానికి చెందిన పెనుగొలను శివారు మెట్టగుట్ట శేషాచల శ్రీనివాసస్వామి ఆలయ అర్చకులు దివంగత పెద్దింటి రామగోపాలాచార్యులు కుమార్తె జ్యోత్స్న ప్రభ వివాహం సందర్భంగా రూ.లక్ష వితరణగా ఇచ్చినట్లు ఆలయ కమిటీ చైర్మన్ జొన్నల ప్రతాపరెడ్డి తెలిపారు. ఆలయ కమిటీ సభ్యులు, అభివృద్ధి కమిటీ సభ్యులతో పాటుగా, కే మహేంద్రలు కలిసి శనివారం పెళ్లి కుమార్తె జ్యోత్స్నప్రభకు ఈమొత్తాన్ని అందజేశారు. టీ నరశింహాచారి బంగారు మంగళసూత్రాలు వితరణగా ఇచ్చారు. కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో భావనారుషి స్వామి కల్యాణం



కొండపలి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి పద్మశాలీ వీధిలో శ్రీశ్రీ భద్రావతి సమేత భావనారుషి దేవాలయంలో స్వామివార్ల కల్యాణ మహోత్సవం శనివారం అత్యంత వైభవంగా జరిగింది. అర్చకులు శేషాచార్యులు ఆధ్వర్యంలో చెరుకు రామకృష్ణ, మాదవీ, మెట్టుకోలు వెంకటేశ్వరరావు, నాగమణి దంపతులు వేదమంత్రోచ్చరణల మధ్య కల్యాణం జరిపించారు. అనంతరం పది రకాల హారతులతో స్వామివార్లకు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం 3 వేల మంది భక్తులకు తీర్థ ప్రసాదాలు, అన్నదానం చేశారు. ఆలయ కమిటీ సభ్యులు పుల్లారావు, చెరుకు నరశింహారావు, సీహెచ్ మాదవరావు, లక్ష్మీకాంతారావు, భక్తులు పాల్గొన్నారు.

జి.కొండూరు: మండల పరిధి వెలగలేరు గ్రామంలో శ్రీ భద్రావతి సమేత భావనారుషి స్వామి వారి కల్యాణం ఆలయ ప్రాంగణంలో శనివారం వైభవంగా జరిగింది. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో 2 వేల మందికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, కమిటీ చైర్మెన్ జీ రాంబాబు, భక్తులు పాల్గొన్నారు.

108 సూర్య నమస్కారాల పోటీలో ద్వితీయ స్థానం

ఇబ్రహీంపట్నం: స్థానిక ఫెర్రీకి చెందిన యోగా గురువు లంకే జనార్దన్ 108 సూర్య నమస్కారాల పోటీలో ద్వితీయస్థానం సాధించాడు. విజయవాడ యోగా ఆరోగ్యకేంద్రం, పతంజలి యోగా సమితి ఆధ్వర్యంలో యనమలకుదురు రామలింగేశ్వర స్వామి ఆలయంలో శనివారం నిర్వహించిన 108 సూర్య నమస్కారాల పోటీల్లో ప్రతిభ కనబర్చి ప్రశంసాపత్రం అందుకున్నాడు. ఆంధ్రప్రదేశ్ యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు గొట్టిపాటి రామకృష్ణప్రసాద్ విజేతలకు బహుమతులు అందజేశారు. సంస్థ అధ్యక్షుడు డి.దుర్గారావు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

- ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు
- రూ.2.26 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



తాగునీటి ట్యాంకు నిర్మాణానికి శిలాఫలకం ఆవిష్కరించిన ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు

నూజివీడు: గ్రామాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. మండలంలోని గొల్లపల్లిలో జలజీవన్‌మిషన్‌లో భాగంగా రూ.1.93 కోట్లతో నిర్మించనున్న రక్షిత తాగునీటి పథకం నిర్మాణానికి, రూ.16 లక్షలతో నిర్వహించనున్న అంగన్‌వాడీ భవన నిర్మాణానికి, రూ.17 లక్షలతో నిర్మించనున్న బల్క్‌మిల్క్ కూలర్ భవన నిర్మాణానికి శనివారం ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామంలో రోడ్లను అభివృద్ధి చేయాల్సి ఉందని, దీనికి గాను స్థానిక సంస్థలు, ప్రభుత్వ సహకారం తీసుకొని త్వరితగతిన అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామన్నారు. రక్షిత మంచినీటి ట్యాంకు నిర్మాణానికి 4 సెంట్ల స్థలాన్ని అందించిన కోచర్ల సాంబశివరావును ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఆరేపల్లి శిరీష, జెడ్పీ వైస్ చైర్మన్ గుడిమళ్ల కృష్ణంరాజు, సర్పంచి బొకినాల వెంకటేశ్వరమ్మ, ఎంపీటీసీలు చల్లారి రేణుక ధనలక్ష్మి, తటకులూరి రామయ్య, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పోలిమెట్ల శివ,ఐసీడీఎస్ సీడీపీవో శేషుకుమారి, నాయకులు ఎస్‌టీపీ వెంకటేశ్వర్లు, ఆరేపల్లి రాంబాబు, చల్లారి రాఘవ, మెరుగ లెనిన్, చల్లారి వెంకట్రామయ్య,తటుకలూరి రంగారావు పాల్గొన్నారు.

పీహెచ్‌సీని పరిశీలించిన ఎమ్మెల్యే

నూజివీడు: మండలంలోని గొల్లపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు శనివారం సందర్శించారు. ఆసుపత్రిలో అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించారు. ఇన్ పేషంట్, ఫార్మసీ, ఆపరేషన్ థియేటర్‌ను, ల్యాబ్ తదితర అన్ని విభాగాలను, రాష్ట్ర ప్రభుత్వం ఆస్పత్రికి సరఫరా చేసిన పరికరాలను పరిశీలించారు. ఆస్పత్రి వైద్యులు అనూష, శ్రీనివాస్ గౌతమ్ ఆసుపత్రిలో అందిస్తోన్న సేవలను ఆయనకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రతాప్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించేందుకు కృషి చేస్తోందన్నారు. ఎమ్మెల్యే వెంట జెడ్పీ వైస్ చైర్మన్ గుడిమళ్ల కృష్ణంరాజు, ఎంపీపీ ఆరేపల్లి శిరీష, సర్పంచి బొకినాల వెంకటేశ్వరమ్మ, ఎంపీటీసీలు చల్లారి రేణుక ధనలక్ష్మి, తటుకలూరి రామయ్య, మాజీ సర్పంచి ఎస్‌టీపీ వెంకటేశ్వర్లు, నాయకులు పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనకే సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే కే రక్షణనిధి
- ఎర్రమాడులో గడప గడపకు మన ప్రభుత్వం

ఎర్రమాడు(తిరువూరు): పేదరిక నిర్మూలనకే ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని తిరువూరు ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి పేర్కొన్నారు. మండలంలోని ఎర్రమాడులో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. విద్యార్థులకు జగనన్న విద్యాదీవెన, అమ్మ ఒడి, వసతి దీవెన, మహిళలకు, రైతులకు, చిరు వ్యాపారులకు ఇలా అన్ని వర్గాలకు పథకాలను అమలు చేయడంతో వారి జీవన స్థితిగతుల్లో మార్పు వస్తోందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ పథకాలకు దరఖాస్తు చేసుకోవచ్చని ఎమ్మెల్యే సూచించారు. ఇంత వరకు ప్రభుత్వం సంక్షేమ పథకాలకు ఇచ్చిన ప్రాధాన్యతపై ప్రతిపక్షాలు చౌకబారు విమర్శలు చేస్తున్నాయన్నారు. గతంలో ఏ ప్రభుత్వం ఇవ్వని రీతిలో క్రమం తప్పకుండా, ఇచ్చిన మాటకు కట్టుబడి సీఎం జగన్ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. ఎర్రమాడులో లబ్ధిపొందిన కుటుంబాలకు ఆయా పథకాల వివరాలతో కూడిన బ్రోచర్లను పంపిణీ చేశారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ శీలం నాగనర్సిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు యరమల రామచంద్రారెడ్డి, ఎంపీపీ గద్దల భారతి, ఎర్రమాడు సర్పంచి మాధవి, మాజీ సర్పంచి కావూరి వెంకటేశ్వరరావు, వైఎస్సార్సీపీ నాయకుడు మోహనరావు తదితరులు పాల్గొన్నారు.



తిరువూరు మండలం ఎర్రమాడులో మహిళకు బ్రోచర్ అందజేస్తున్న ఎమ్మెల్యే రక్షణనిధి

విద్యార్థులకు చట్టాలపై అవగాహన ఉండాలి

జడ్జి షేక్ షిరీన్



మైలవరంలో సదస్సులో మాట్లాడుతున్న జడ్జి షేక్ షిరీన్

మైలవరం: విద్యార్థులకు చదువుతో పాటు చట్టాలపై కూడా అవగాహన ఉండాలని జూనియర్ సివిల్ కోర్టు జడ్జి షేక్ షిరీన్ పేర్కొన్నారు. సుప్రీం కోర్టు జాతీయ లీగల్ సర్వీస్ అథారిటీ పిలుపు మేరకు మైలవరం మండలం న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ఎస్ఎస్‌కే హైస్కూల్‌లో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. మైలవరం బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు బుద్దవరపు వెంకట్రావు సమావేశానికి అధ్యక్షతన సమావేశం జరిగింది. సదస్సులో జడ్జి షేక్ షిరీన్ మాట్లాడుతూ 14 సంవత్సరాల లోపు బాల బాలికలకు ప్రభుత్వం ఫీజులు లేకుండా నిర్బంధ విద్యా విధానం అమలు చేస్తుందన్నారు. తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకుని తమ పిల్లలను విద్యావంతులుగా తీర్చిదిద్దాలని అన్నారు. సమస్య ఉన్నపుడు పోలీసులకు, 101కు ఫోన్ చేయాలని విద్యార్థులకు ఆమె సూచించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు గునగంటి శ్రీనివాసరావు, ఎస్ఎస్‌కే విద్యా సంస్థల అధినేత గొల్లపూడి మోహనరావు, ఉపాధ్యాయులు బాబూజీ, జూనియర్ న్యాయవాది ఎం.తనూజ్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో డీవైఈఓ ఆకస్మిక తనిఖీ



ముసునూరు: నూజివీడు డీవైఈఓ సేవియా నాయక్ శనివారం ముసునూరు హైస్కూల్‌ను ఆకస్మిక తనిఖీ చేశారు. ముందుగా 8, 9, 10 తరగతుల విద్యార్థులను ఆంగ్ల, గణిత సబ్జక్టుల్లో విద్యా ప్రమాణాలను తనిఖీ చేశారు. 8వ తరగతి విద్యార్థులకు ప్రభుత్వం అందించిన ట్యాబ్‌ల వినియోగంపై పరిశీలన చేశారు. పదో తరగతి విద్యార్థులకు మోటివేషన్ కార్యక్రమం నిర్వహించి 10కి 10 గ్రేడులను అందరూ సాధించాలని కోరారు. ఉపాధ్యాయులంతా సమకాలీన పోటీ పరిస్థితులకు అనుగుణంగా, పాఠ్య ప్రణాళిక ప్రకారమే విద్యా బోధన చేయాలని ఆదేశించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారమే ఆహార పదార్థాలను రుచిగా శుచిగా వడ్డించాలని హెచ్‌ఎం శ్రీనివాస్‌కు సూచించారు. విద్యార్థులతో కలసి భోజనం చేశారు. అనంతరం రికార్డులను తనిఖీ చేశారు.

ఓటీఎస్ పథకం పేదలకు వరం

ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు



గొల్లపల్లిలో రిజిస్ట్రేషన్ పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే ఎంవీ ప్రతాప్ అప్పారావు

నూజివీడు : రాష్ట్ర ప్రభుత్వం సంపూర్ణ గృహ పథకం కింద అమలు చేస్తోన్న ఓటీఎస్ విధానం పేదవర్గాలకు వరమని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. మండలంలోని గొల్లపల్లిలో 74 మంది పేదలకు వన్‌టైమ్ సెటిల్‌మెంట్(ఓటీఎస్) కింద రిజిస్ట్రేషన్ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ పట్టాల వల్ల పేదలకు తమ నివేశన స్థలంపై పూర్తి హక్కు వస్తుందని, బ్యాంకుల్లో రుణాల కోసం పెట్టుకోవడం, విక్రయించుకోవడం తదితర వాటికి వినియోగించవచ్చన్నారు. గొల్లపల్లిలో 58 మంది పేదలకు కేవలం రూ.10లకే వారి ఇళ్ల స్థలాలను రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చామన్నారు. పేదల సంక్షేమం కోసం కృషి చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంటే రాష్ట్ర ప్రజలు ఉంటారన్నారు. చంద్రబాబు బ్యాచ్ మాయమాటలు చెప్పి మోసం చేయాలని చూస్తున్నారని, అలాంటి వారి మాటలు నమ్మి మోసపోవద్దని అన్నారు. జెడ్పీ వైస్ చైర్మన్ గుడిమళ్ల కృష్ణంరాజు, ఎంపీపీ ఆరేపల్లి శిరీష, సర్పంచి బొకినాల వెంకటేశ్వరమ్మ, ఎంపీటీసీలు చల్లారి రేణుక ధనలక్ష్మి, తటుకలూరి రామయ్య, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పోలిమెట్ల శివ, మాజీ సర్పంచి ఎస్‌టీపీ వెంకటేశ్వర్లు, చల్లారి రాఘవ, మెరుగ లెనిన్, చల్లారి వెంకట్రామయ్య, తటుకలూరి రంగారావు, ఆరేపల్లి రాంబాబు, పల్లె రవీంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కంటైనర్ సబ్ స్టేషన్‌తో నిరంతర విద్యుత్ సరఫరా

ఏపీసీపీడీసీఎల్ సీఎండీ పద్మ జనార్ధన్‌రెడ్డి



కంటైనర్ సబ్ స్టేషన్ వద్ద సీఎండీ పద్మజనార్ధన్‌రెడ్డి, ఇతర అధికారులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఎన్టీఆర్ జిల్లా విజయవాడ రూరల్ మండలం గొల్లపూడి శ్రీనివాస నగర్‌లో నూతనంగా నిర్మించిన 33/11 కేవీ కంటైనర్ విద్యుత్ సబ్ స్టేషన్‌ను ఏపీసీపీడీసీఎల్ సీఎండీ జే పద్మ జనార్ధన్‌రెడ్డి శనివారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సబ్ స్టేషన్ నిర్మాణ పనులన్నీ పూర్తయ్యాయని, త్వరలో వినియోగదారులకు అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. ఈ సబ్ స్టేషన్ పరిధిలోకి లాంకో కాలనీ, సాయిపురం కాలనీ, శ్రీనివాసనగర్, పంట కాలువ రోడ్, గొల్లపూడి బైపాస్ రహదారి, అట్కిన్‌సన్ స్కూల్ రోడ్ ఏరియా వినియోగదారులకు నాణ్యమైన నిరంతరాయ విద్యుత్‌ను సరఫరా చేసేందుకు ఈ కంటైనర్ సబ్ స్టేషన్‌ను నిర్మించామని వివరించారు. ఏపీసీపీడీసీఎల్ డైరెక్టర్ బీ జయభారత్‌రావు, విజయవాడ టౌన్ డివిజన్ కార్యనిర్వాహక ఇంజినీర్ బీవీ సుధాకర్, కనస్ట్రక్షన్ కార్యనిర్వాహక ఇంజినీర్ ఎం.వసంతరావు, ఉప కార్యనిర్వాహక ఇంజినీర్ కే కోటేశ్వరరావు, సహాయక కార్యనిర్వాహక ఇంజినీర్ కే అనిల్ బాబు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ వార్షికోత్సవం

నెమలి(గంపలగూడెం): గంపలగూడెం మండలం నెమలి శ్రీవేణుగోపాలస్వామి దేవస్థానంలో శనివారం విగ్రహ ప్రతిష్ఠావార్షికోత్సవం, రథసప్తమి కార్యక్రమాలను శనివారం వైభవంగా నిర్వహించారు. సుప్రభాత సేవతో ప్రత్యేక పూజా కార్యక్రమాలను ఆలయ ప్రధాన అర్చకులు తిరునగరి గోపాలాచార్యులు,అర్చకబృందం ప్రారంభించారు. శ్రీవేణుగోపాలునికి పంచామృతాలు, నవరస ఫలాలతో అభిషేకం నిర్వహించారు. స్వామిని అలంకరించి, పూజలు చేశారు. శ్రీగోపాల లక్ష్మీసుదర్శన హోమం, సూర్యనారాయణ మహామంత్ర హోమాలను అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ కావూరి శశిరేఖ, పాలకవర్గ సభ్యులు నూకల నాగలక్ష్మణరావు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించండి

ఆర్టీసీ డీఎం పవన్‌కుమార్



నూజివీడులో ర్యాలీ నిర్వహిస్తున్న ఆర్టీసీ అధికారులు, సిబ్బంది

నూజివీడు: రహదారి భద్రతా నియమాలను ప్రతి ఒక్కరూ పాటించినప్పుడే ప్రమాదాలను నివారించగలమని ఆర్టీసీ డిపో మేనేజర్ సీహెచ్ పవన్‌కుమార్ అన్నారు. రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా ఆర్టీసీ సిబ్బంది శనివారం పట్టణంలోని ప్రధాన రహదారుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కారుల్లో ప్రయాణించే వారు తప్పనిసరిగా సీటుబెల్టు ధరించాలని, ద్విచక్ర వాహనాలపై వెళ్లే వారు హెల్మెట్ పెట్టుకోవాలన్నారు. మద్యం సేవించి డ్రైవింగ్ చేయవద్దని, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయరాదన్నారు. అతివేగంగా వాహనాలను నడపొద్దని సూచించారు. ప్రజలందరూ రహదారి భద్రతా నియమాలను, ట్రాఫిక్ నిబంధనలను పాటించాలన్నారు. రోడ్డు ప్రమాదాల్లో యువత ఎక్కువగా ప్రాణాలను కోల్పోతున్నారని, దీనివల్ల యువశక్తి నిర్వీర్యమైపోతోందన్నారు. విద్యార్థి దశ నుంచే రోడ్డు భద్రతపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా రథసప్తమి వేడుకలు

పెద్ద ఎత్తున స్వామివార్లను దర్శించుకున్న భక్తులు



మూలవిరాట్‌ను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు

ఆగిరిపల్లి: ఆగిరిపల్లి శోభనగిరిపై శోభనాచల వ్యాఘ్రలక్ష్మీ నరసింహ స్వామివార్ల మాఘమాస రథసప్తమి వేడుకలు శనివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచే భక్తులు స్వామివారి కొండపైకి నడుస్తూ మెట్లకు పూజ చేశారు. వంశపారంపర్య ధర్మకర్తలైన నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు దిగువ సన్నిధిలో స్వామివారి మూల విరాట్‌లను దర్శించుకున్నారు. అనంతరం ఉదయం 11 గంటలకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. సుమారు 20 వేల మంది భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

ఆలయ ఈవో ఎన్.భవాని, ఎస్ఐ ఎన్.చంటిబాబు, వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జి మచ్చా హరిబాబు, మండల కన్వీనర్ పల్లగాని నరసింహారావు, అన్నదాన కమిటీ సభ్యులు పాల్గొన్నారు. స్వామివారి శాంతి కల్యాణాన్ని వట్టిగుడిపాడుకు చెందిన సత్యనారాయణ దంపతుల ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు వేదాంతం శేషబాబు, ఇతర వేద పండితులు ఘనంగా జరిపించారు.

కొండపై శోభనాచల వ్యాఘ్రలక్ష్మీ నరసింహ స్వామివారిని, ఎగువ కొండపై బ్రహ్మసూత్ర సహిత స్వయంభు దుర్గాపార్వతి సమేత మల్లికార్జునస్వామిని, దిగువన కోవెలలో ఉన్న స్వామివారి మూల విరాట్‌ను దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. ధ్వజస్తంభం వద్ద భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. పటిష్ఠ బందోబస్తు నిర్వహించారు. ఆలయ ఈవో భవాని ఏర్పాట్లను పర్యవేక్షించారు.

క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి



పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీపీ లక్ష్మీతిరుపతమ్మ, జెడ్పీటీసీ జక్రధరరావు

జి.కొండూరు: గ్రామీణ ప్రాంత యువత క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలని ఎంపీపీ వేములకొండ లక్ష్మీతిరుపతమ్మ అన్నారు. స్థానిక శాగం శివరామిరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి టెన్నీకాయిట్, టార్గెట్ బాల్ పోటీలను స్థానిక జెడ్పీటీసీ సభ్యుడు మందా జక్రధరరావుతో కలిసి ఎంపీపీ శనివారం ప్రారంభించారు. ఎంపీపీ లక్ష్మీతిరుపతమ్మ మాట్లాడుతూ రాష్ట్రస్థాయి పోటీలను గ్రామీణ ప్రాంతాలలో నిర్వహించడం శుభపరిణామమన్నారు. ఎంఈఓ పీ వెంకటనర్సింహారావు, పాఠశాల హెచ్‌ఎం రాజశేఖర్, పీడీ సీజర్‌రెడ్డి, పీఈటీ మాధవరావు పాల్గొన్నారు.

పోటీలకు 550 మంది క్రీడాకారులు

రాష్ట్రంలోని 13 జిల్లాల నుంచి క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నారు. టెన్నీకాయిట్ అండర్-14,17 విభాగాల్లో బాల, బాలికలు 26 జట్లు పాల్గొనగా టార్గెట్ బాల్ పోటీలకు ఏడు జిల్లాల నుంచి బాల, బాలికలు 14 జట్లు పాల్గొన్నాయి. ఈ పోటీలకు మొత్తం 550 మంది క్రీడాకారులు హాజరయ్యారని పాఠశాల పీడీ సీజర్ రెడ్డి తెలిపారు. మూడు రోజుల పాటు జరగనున్న ఈ పోటీల్లో విజేతలను ఈ నెల 30వ తేదీన ప్రకటిస్తామని పేర్కొన్నారు.

అర్హులందరికీ నవరత్నాల పథకాలు



సమావేశంలో మాట్లాడుతున్న దేశిరెడ్డి

చాట్రాయి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న నవరత్నాల పథకాలు రాజకీయాలకు అతీతంగా అర్హులందరికి అందుతున్నాయని ఏపీ స్టేట్ కో ఆపరేటివ్ యూనియన్ రాష్ట్ర చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి స్పష్టం చేశారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ లంకా నిర్మల అధ్యక్షతన నిర్వహించిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంపీపీ మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో తాగునీటి సరఫరాకు రూ.17 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. అనంతరం శాఖల వారీగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా చాట్రాయి, చనుబండ గ్రామాల్లోని పశు వైద్యశాలల్లో డాక్టర్లు లేకపోవడంతో పశుపోషకులు ఇబ్బందులు పడుతున్నారని మండల పరిషత్ ఉపాధ్యక్షుడు పుచ్చకాయల సుబ్బారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ పరసా చెన్నారావు సభకు విన్నవించారు. జనార్దనవరం ఆర్‌అండ్‌బీ మెయిన్ రోడ్డుపై పడిన గోయ్యి కారణంగా ప్రమాదాలు జరుగుతున్నాయని ఎంపీటీసీ పోతురెడ్డిపల్లి కృష్ణ, సర్పంచ్ పామర్తి ఝాన్సీ సమావేశంలో వివరించారు. అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణాలు పూర్తి చేయాలని, గ్రామాల్లో లైన్‌మెన్ పోస్టులు భర్తీ చేయాలని సభ్యులు సభ దృష్టికి తీసుకెళ్లగా ఎమ్మెల్యే దృష్టికి తీసికెళ్లి పరిష్కరిస్తామన్నారు.

చనుబండలో కొత్తగా మంజూరైన రెండో ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రూ 2.30 కోట్లు మంజూరయ్యాయని వారంలో టెండర్లు పిలిచి పనులు ప్రారంభిస్తామని పంచాయతీరాజ్ డీఈ సీహెచ్ బాబూరావు సభకు వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎస్.మురళీ మోహనరావు, పీహెచ్‌సీ వైద్యాధికారి ఎ.శ్రీనివాసరెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

రహదారులకు అత్యవసర మరమ్మతులు చేస్తాం

చైర్‌పర్సన్ గత్తం కస్తూరిబాయి

తిరువూరు: పట్టణంలోని అన్ని రహదారులపై ఏర్పడిన గుంతల పూడ్చివేతకు అత్యవసర మరమ్మతులు చేయనున్నట్లు నగర పంచాయతీ చైర్‌పర్సన్ గత్తం కస్తూరిబాయి తెలిపారు. శనివారం నగర పంచాయతీ కౌన్సిల్ అత్యవసర సమావేశం నిర్వహించారు. రహదారుల మరమ్మతులకు వెంటనే చర్యలు చేపట్టాలని ఆమె అధికారులను కోరారు. వచ్చే మార్చి 31వ తేదీతో పశువుల సంత, ఆశీలు పాటలు, దుకాణ సముదాయాల లీజు గడువు పూర్తవుతుందన్నారు. బహిరంగ వేలం నిర్వహించి నగర పంచాయతీ ఆదాయం పెంపునకు కృషి చేయాలని సూచించారు. ఇటీవల పూర్తి చేసిన పలు రహదారుల మరమ్మతు పనులకు నిధులు కేటాయిస్తూ సమావేశంలో తీర్మానించారు. తాగునీరు, వీధి దీపాల నిర్వహణ తదితర సమస్యలపై కౌన్సిలర్లు సమావేశంలో చర్చించారు. వైస్ చైర్ పర్సన్స్ విజయలక్ష్మి, వెంకటేశ్వరి, ఇన్‌చార్జి కమిషనర్ బాలకృష్ణ, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ

తెల్లదేవరపల్లి(విస్సన్నపేట): మండలంలోని తెల్లదేవరపల్లి తండాలో నూతనంగా నిర్మించిన దేవాలయంలో ఆంజనేయస్వామి విగ్రహం ప్రతిష్ఠ, ధ్వజస్తంభం ప్రతిష్ఠామహోత్సవం శనివారం వైభవంగా నిర్వహించారు. అనంతరం అన్నసమారాధన చేశారు. ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి, జెడ్పీటీసీ భీమిరెడ్డి లోకేశ్వరరెడ్డి, ఎంపీటీసీ చాట్ల మణి, మాజీ సర్పంచ్ దారావతు శ్రీను, తండా భక్తబృందం, భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఎదురెదురుగా ఢీకొన్న రెండు లారీలు

నూజివీడు: బత్తులవారిగూడెం వద్ద శనివారం రెండు లారీలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. నూజివీడు, మైలవరం నుంచి వచ్చే రెండు లారీలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో డ్రైవర్‌కు స్వల్ప గాయాలు కాగా, పక్కనే టీవీఎస్ మోపెడ్‌పై వెళ్తున్న చిట్టిపోతుల వెంకటేశ్వరరావు (52)కు స్వల్పగాయాలయ్యాయి. వీరిని ఆసుపత్రికి తరలించారు. రూరల్ ఎస్ఐ తలారి రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పబ్లిక్ నోటీసు

నా క్లయింటు అయిన యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, నూజివీడు బ్రాంచి తరఫున బ్రాంచి మేనేజర్ గారి సంజాయిషీ పొంది యావన్మందికి తెలియచేయునది ఏమనగా

కృష్ణాజిల్లా, ప్రస్తుతం ఏలూరు జిల్లా, నూజివీడు మండలం, నూజివీడు గ్రామ కాపురస్తులు [illegible]

నూజివీడు, ది. 28-01-2023 — డి.యమ్.వి.పి. శేఖర్, న్యాయవాది, సమతానగర్, నూజివీడు. సెల్: 98485 38787